## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం
ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers
JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:339 | సోమవారం జూలై 13, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


### వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి..

# భారతీయుడి గల్లంతు

**ఒమన్ తీరం వద్ద హర్మూజ్ జలసంధిలోవాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ చేసిన దాడిలో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు.**



ఒమన్ తీరం వద్ద హర్మూజ్ జలసంధిలోవాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ చేసిన దాడిలో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. సైప్రస్ జెండాతో వెళ్తున్న ఈ నౌకలో మొత్తం 11 మంది భారతీయులు ఉండగా.. వారిలో 10 మందిని రక్షించారు. ఈ విషయాన్ని భారత దౌత్య కార్యాలయం ధ్రువీకరించింది.

2లో

# వియత్నాం ఘటన..

## సకాలంలో సీపీఆర్ చేసి ఉంటే మరింత మంది బతికేవారు!



వియత్నాంలో పడవ బోల్తా పడిన ఘటనలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో 15 మంది భారత పర్యాటకులు మృతి చెందారు. ఈ ఘటనపై ఈ టూర్‌లో భాగమైన ఏపీకి చెందిన ఒక ప్రత్యక్ష సాక్షి పలు విషయాలు తెలిపారు. బోటు మునిగిన వెంటనే సహాయ చర్యలు అందలేదని, లేదంటే మరింత మంది బతికే వారని తెలిపారు. అపస్మారక స్థితికి చేరుకున్న వారికి వెంటనే ఎలాంటి ప్రాథమిక చికిత్స గానీ, సీపీఆర్ గానీ చేయలేదని పేర్కొన్నారు. అక్కడి సిబ్బంది తక్షణమే స్పందించి ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదన్నారు.

**పెద్ద అల ఢీకొట్టడంతోనే..**

తీరానికి చేరుకుంటున్న సమయంలో ఒక పెద్ద అల ఢీకొట్టిందని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. దీంతో 20 మంది సముద్రంలో పడగా,

2లో

# ముంబయిలో పవన్‌కు శస్త్రచికిత్స..

**పరామర్శించిన సీఎం చంద్రబాబు**



- పవన్‌కు విజయవంతమైన భుజం శస్త్రచికిత్స.
- ముంబయిలో పరామర్శించిన సీఎం చంద్రబాబు.
- మూడు వారాలు విశ్రాంతి సూచించిన వైద్యులు.
- రొటేటర్ కఫ్ గాయానికి సర్జరీ.
- ఎడమ భుజంపై కూడా వైద్యుల పరిశీలన.
- త్వరగా కోలుకోవాలని చంద్రబాబు ఆకాంక్ష.

ముంబయి: ఏపీ సీఎం చంద్రబాబు ముంబయి వెళ్లారు. అక్కడ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ను ఆయన పరామర్శించారు. పవన్ కుడి భుజానికి వైద్యులు శనివారం శస్త్రచికిత్స చేశారు. దీంతో చంద్రబాబు వెళ్లి ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చంద్రబాబు వెంట మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు.
పవన్‌ను పరామర్శించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "పవన్ కుడి భుజానికి జరిగిన ఆపరేషన్ విజయవంతమైంది. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు సూచించాను. పవన్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. వైద్యులు మూడు వారాలు విశ్రాంతి అవసరమని చెప్పారు. ఆయన రెండో భుజానికీ సమస్య ఉంది. దానికి ఆపరేషన్ చేయాలా?ఫిజియో థెరపీ సరిపోతుందా? అనేది వైద్యులు పరిశీలిస్తున్నారు" అని చంద్రబాబు

2లో

## కొట్లాడి మరీ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇప్పిస్తా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి కోసం తపన పడుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు తాను కొట్లాడి మరీ మంత్రి పదవి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఈసారి దేశంలో కచ్చితంగా జమిలి ఎన్నికలు వస్తాయని, అయితే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తి ఐదున్నర సంవత్సరాలు అధికారంలో కొనసాగుతారని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు పెరుగుతాయని.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 117 స్థానాలు గెలవడమే కాంగ్రెస్ టార్గెట్ అని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు



2లో

## విశాఖలోని పలు ప్రాంతాల్లో కంపించిన భూమి



2లో

## హింసను ప్రేరేపించేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు: హరీశ్‌రావు






### గొంతే ఓ ప్రయోగశాల

# ప్రతి పాటలోనూ అమృతధార

"సంగీతం నాకే జీవితం, పాటలే నా పరం, శ్రోతలే నా కుటుంబం."
--- ఎస్. జానకి

**పగలే వెన్నెల కురిపించిన జానకి అమృతమయ మాధుర్యం!**
**కళ్లలో ఉన్నదేదో కన్నులకే తెలిపిన ప్రేమ భావనల సెలయేరు ఆ పాటలు...**
**ఆ పాటే అమ్మ పాడిన పాట, మన జానకమ్మ పాడిన పాట.**
**ఇంకెన్నేళ్లైనా నిత్యనూతనంగా వినిపించే పాట.**
**అమృతపు తడిని అద్దుకుని కొలువైన బంగారు గొంతు.**

దేవతలకు మాత్రమే కాదు... మన జానకమ్మకూ అమృతం దక్కింది. కానీ యాభై వేలకుపైగా పాటలకు దాన్ని అంకితం చేశారు. అలా తనకే దొరికిన అమృతాన్నంతా పాటలకే సమర్పించారు. ఇప్పుడు ఆమె మన మధ్య లేకపోయినా, ఆమె గానం యుగయుగాల పాటు చిరంజీవిగా నిలుస్తుంది. ఇక నుంచి జానకి కనిపించరు... కానీ ఆమె పాడిన పాటలు చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటాయి.

"సిగ్గులతో నిండిన అమ్మాయి నవ్వు...
ప్రణయంలో మునిగిన హృదయాల ఊపిరి...
వేదనతో కుమిలిన తల్లి గుండెచప్పుడు...
భక్తి పారవశ్యం... తాత్విక తాదాత్మ్యం...
అన్నీ ఆ ఒక్క గొంతులోనే!"



## ఎస్. జానకి
**(1938 – 2025)**
**స్వరరత్నానికి కన్నీరాంజలి**

**జానకి ప్రత్యేకతలు**

చిన్నారి నుంచి వృద్ధురాలి వరకు...
యువకుడి నుంచి భక్తిరసాల వరకు...
ప్రతి పాత్రకు స్వరాన్ని ఇచ్చిన గాత్రం.
భావాల్ని విప్పిన గాత్రం



తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, మలయాళం తదితర భాషల్లో 50,000కు పైగా పాటలు.



**ప్రయోగాల గిరిశిఖరం**

'పాప పేరు మల్లి' వంటి యువకుడి గొంతు, 'అలకపానుపు' వంటి విభిన్న గాన శైలులు... అన్నీ ఆమె ప్రత్యేక ప్రయోగాలు.



**శాశ్వత వారసత్వం**

జానకి కనిపించకపోవచ్చు... ఆమె గానం యుగయుగాల పాటు మనసుల్లో నిలిచిపోతుంది.



2లో

# నిజాయితీకి మారుపేరుగా నిలిచిన హోంగార్డు.

## భక్తురాలికి తిరిగి అప్పగించిన మొబైల్ ఫోన్.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జులై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విధుల్లో ఉన్న హోంగార్డు బాజీ తన నిజాయితీని చాటుకున్నారు. ఆలయానికి వచ్చిన ఓ భక్తురాలికి సంబంధించిన మొబైల్ ఫోన్‌ను ఆమెకు తిరిగి అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.ఆదివారం సెలవు దినం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ భారీగా ఉంది. ఈ క్రమంలో, తాడేపల్లిగూడేనికి చెందిన ఓ భక్తురాలు పాదుకా మండపం సమీపంలోని ప్రసాదం కౌంటర్ వద్దకు వెళ్లారు. అక్కడ మొబైల్ ఫోన్‌ను మరచిపోయి వెళ్లిపోయారు.విధుల్లో ఉన్న హోంగార్డు బాజీ భాయ్ అటుగా వెళ్తుండగా, అక్కడ పడి ఉన్న ఫోన్‌ను గమనించారు. వెంటనే ఆ ఫోన్‌ను భద్రపరిచిన ఆయన, సంబంధిత భక్తురాలిని గుర్తించి, ఆ మొబైల్‌ను ఆమెకు అందజేశారు. తన ఫోన్ తనకు దక్కడంతో ఆ భక్తురాలు హర్షం వ్యక్తం చేశారు.హోంగార్డు బాజీ భాయ్ ప్రదర్శించిన ఈ చిత్తశుద్ధిని స్థానిక భక్తులు, తోటి సిబ్బంది అభినందించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఇలా బాధ్యతాయుతంగా వ్యవహరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డిండిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**జనసముద్రం న్యూస్ జూలై 12: డిండి :-**



నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2000-2001 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం డిండిలోని వి ఏ ఎస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు.25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎస్ఎస్సి బ్యాచ్,ఈ సందర్భంగా సిల్వర్ జూబ్లీ సమ్మేళనంగా నిర్వహించుకున్నారు.ఈ సమావేశానికి అలనాటి ఉపాధ్యాయులు ఏ.జంగారెడ్డి, వి.జంగారెడ్డి,వంగాల శేఖర్ రెడ్డి, ఎస్.లింగయ్య,వి.ప్రసాద్, ఎలకుర్తి రమేష్ హాజరై పూర్వ విద్యార్థులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ , పూర్వ విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు, క్రమశిక్షణగా సమాజంలో మసులుకొని, ఉన్నత, ఉత్తమ పౌరులుగా మెలగాలని సూచించారు.విద్యార్థులతో అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.పూర్వ విద్యార్థులు తమ గురువులను సాలువాలతో, మెమొంటోలతో, పూలమాలతో ఘనంగా సన్మా నంచి తమ గురుభక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంలో విద్యార్థులు విద్యార్థినిలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకొని,అలనాటి తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని విద్యార్థులు శ్వేత, శోభ, సునీత ,స్వాతి, శృతి,శివలీల,విమల,అంజయ్య,ప్రేమయ్య,శ్రీశైలం,నరేష్,కరీం,వెంకటేష్, జ్ఞానేందర్,ప్రేమయ్య, కేశవులు,సైదులు,గోపాల్, అన్వర్,యాదగిరి,శ్రీరాములు, నిరంజన్ తో పాటు 50 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

# హింసను ప్రేరేపించేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు(ఝుతీఅంష్త్రతీఝుశీ) విమర్శించారు. హిట్లర్ తనకు ఆదర్శమని గతంలో రేవంత్ చెప్పారు.. అందుకే హిట్లర్ తరహాలో మాట్లాడుతున్నారన్నారు. చెప్పేందుకు విషయం లేకనే బూతులు మాట్లాడుతున్నారని.. నిన్నటి వ్యాఖ్యలపై సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. షాబాద్ ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించినా.. తెలంగాణ సీఎం స్పందించలేదన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రాజెక్టులపై కనీస అవగాహన లేకుండా సీఎం మాట్లాడుతున్నారన్నారు. మేడిగడ్డ వద్ద నీళ్లు ఎత్తిపోయవచ్చని, విశ్రాంత ఇంజినీర్లు, నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నా.. ఎందుకు ఎత్తిపోయట్లేదని ప్రశ్నించారు. సీఎంగా 31 నెలలు పూర్తయినా.. కాళేశ్వరంపై రేవంత్‌రెడ్డికి అవగాహన రాలేదన్నారు. రైతులకు నీళ్లిచ్చే ప్రయత్నం చేయకుండా.. ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు."వాస్తవాలు మాట్లాడిన వారిని జైలులో పెడతానంటూ భయపెడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు మీద హైదరాబాద్ సహా అనేక జిల్లాలు ఆధారపడ్డాయి. రాజకీయాలకు పోయి..కరవు సమస్యను జఠిలం చేయొద్దు. నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్టు చేస్తుంటే ఊరుకునేది లేదు. కన్నెపల్లి పంప్‌హౌస్ కట్క నొక్కమంటే.. విపక్షాల కంఠం నొక్కుతున్నారు. మేడిగడ్డపై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అవాస్తవాలే" అని హరీశ్‌రావు విమర్శించారు.

# కొట్లాడి మరీ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇప్పిస్తా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోయారని మండిపడ్డారు. లక్షల కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టినా ఆలేరుకు కనీసం రెండు కాలువలు కూడా తీయలేదన్నారు. పైన కొండాపోచమ్మ, మల్లన్న సాగర్ లు నిండుకుండల్లా ఉన్నా ఆలేరుకు నీళ్లివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్టకు కేసీఆర్ పదిసార్లు వచ్చినా కొండ మీద మాత్రమే చూశారని.. కొండ కింద అభివృద్ధిని గాలికొదిలేశారని, అందుకే ఆయనకు ప్రజల ఉసురు తగిలి ఓడిపోయారని ఎద్దేవా చేశారు.

ప్రస్తుతం నిధుల కొరత ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వం పైసా పైసా జమ చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు, ఉచిత కరెంట్ వంటి హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించడంతో పాటు వారి స్కిల్స్ పెంచి ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని.. ఇందుకోసం 20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని.. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడే నితిన్ గడ్కరీతో మాట్లాడి వంగపల్లి అండర్ పాస్ పనులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. బస్వాపురం, గందమళ్ల రిజర్వాయిర్ పనులను పూర్తి చేసి ఆలేరును సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు. పదవుల కంటే ప్రజలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని.. ఎవరికి ఏ కష్టం వచ్చినా తన వద్దకు రావచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ నేతలను ఉద్దేశిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "60 ఏళ్ల తెలంగాణ నెత్తురు తాగినా ఆ పార్టీ రక్తదాహం తీరలేదా? ఉద్యమంలో ప్రాణాలు బలితీసుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే. కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ బిడ్డల నెత్తుటి మరకలు అంటాయి. తెలంగాణ రాష్ట్ర సాధనకు పేగులు తెగేలా కొట్లాడిన వాళ్లం.. ఇప్పుడు రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోసేందుకు సిద్ధం. మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం.. మీ రక్తదాహం తీర్చుకోండి. కానీ.. రైతులకు మాత్రం నీళ్లివ్వండి." అని కేటీఆర్ పేర్కొన్నారు.

# విశాఖలోని పలు ప్రాంతాల్లో కంపించిన భూమి

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 4.5గా నమోదైంది. గాజువాక, మంగళపాలెం, పెదవాల్తేరు, ఆరిలోవ, ఎంవీపీ అప్పుఘర్‌లో ఆదివారం ఉదయం 5.08 గంటలకు భూమి కంపించినట్టు సమాచారం. కాకినాడకు 225 కి.మీ దూరంలో బంగాళాఖాతంలో 10 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

# ముంబయిలో పవన్‌కు శస్త్రచికిత్స..

మొదటిపేజీ తరువాయి

ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి శనివారం సర్జరీ చేసింది. రొటేటర్ కఫ్ గాయంతో పాటు భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో ఈ శస్త్రచికిత్స అవసరమైంది. మరికొన్ని రోజుల తర్వాత ఎడమ భుజానికీ శస్త్రచికిత్స చేయనున్నారు. ఏప్రిల్‌లో పవన్ కల్యాణ్ ముక్కుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంలో పలు వైద్య పరీక్షలు చేశారు. అప్పుడే భుజాలకు రొటేటర్ కఫ్ గాయాలు, మజిల్ టేర్స్ తీవ్రస్థాయిలో ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో పవన్ ముంబయి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

## వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి..

# భారతీయుడి గల్లంతు

మొదటిపేజీ తరువాయి

" వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఒమన్ తీరంలో దాడిచేయడాన్ని మేము ఖండిస్తున్నాం. దీనిలో ఉన్న 11 మంది భారతీయుల్లో 10 మందిని రక్షించారు. ఒకరి జాడ గల్లంతైంది. ఒమన్‌లోని మా దౌత్య కార్యాలయం పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తోంది. గాలింపు చర్యల్లో ఒమన్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. ఒమన్ ప్రభుత్వం అందించిన సాయానికి ధన్యవాదాలు" అని భారత విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

హర్మూజ్ జలసంధిలో జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై ఇరాన్ దాడి చేయడంతో భారీగా మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది ఆ నౌకను వదిలేసి ఒక చిన్న లైఫ్‌బోట్‌లో బయటపడ్డారు. నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనతో హర్మూజ్ జలసంధి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిపోయింది. ఇరాన్‌లోని మొత్తం 140 లక్ష్యాలపై అమెరికా దాడులు చేసింది.

# వియత్నాం ఘటన..

మొదటిపేజీ తరువాయి



మిగతావారు అందులోనే చిక్కుకుపోయారని బోటులో ఉన్న నిర్మల్ కుమార్ చెప్పారు. బోటు పూర్తిగా మూసివేసి ఉందని, దీంతో వెనకాల ఉన్నవారు బయటికి రాలేకపోయినట్లు వెల్లడించారు. తాను, తన స్నేహితుడు బోటుకు ముందు భాగంలో ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డట్లు తెలిపారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి అక్కడి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

**మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు చర్యలు**

ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది పర్యాటకుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అక్కడి భారత రాయబార కార్యాలయం చర్యలు చేపట్టింది.

# 'గొంతే ఓ ప్రయోగశాల'.. ప్రతి పాటలోనూ అమృతధార

మొదటిపేజీ తరువాయి

పగలే వెన్నెల కురిపించి జగాన్ని ఊపేసిన హుషారు ఆ పాట... కళ్లలో ఉన్నదేదో కన్నులకే తెలుసన్న ప్రేమ భావనల సెలయేరు ఆ పాట... ఆ పాట అమ్మ పాడిన పాట, మన జానకమ్మ పాడిన పాట. ఇంకెన్నేళ్లైనా నిత్యనూతనంగా వినిపించే పాట. అమృతపు తడిని అద్దుకుని బయటికొచ్చిన పాట. దేవతలకే కాదు... మన జానకమ్మకూ అమృతం దక్కింది. కానీ యాభై వేలకుపైగా పాటలకు దాన్ని అద్దేశారు. అలా తనకి దొరికిన అమృతాన్నంతా వాటికే అంకితం చేసేశారు. ఇప్పుడామె తనువు చాలించారు. ఇక నుంచి జానకి కనిపించరు కానీ... ఎన్నో భాషల్లో ఆమె పాడిన పాటలు చిరంజీవం. సిగ్గులొలికిన అమ్మాయి నవ్వు... ప్రణయంలో మునిగిన హృదయాల ఊపిరి... వేదనతో కుమిలిన తల్లి గుండెచప్పుడు... భక్తి పారవశ్యం... తాత్విక తాదాత్మ్యం... – అన్నీ ఆ ఒక్క గొంతులోనే! 'గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన గోధూళి ఎర్రనా ఎందువలన?' (సప్తపది) అంటూ చిన్నారిలా పాడిన ఎస్.జానకి... 'అలకపానుపు ఎక్కనేల చిలిపి గోరింకా...' (శ్రీవారి శోభనం) పాటలో అటు యువతిగానూ... ఇటు వృద్ధురాలిగానూ గొంతు సవరించుకుని ఆలపించారు. 'పాప పేరు మల్లి... నా ఊరు కొత్త డిల్లీ...' అంటూ యువకుడిగానూ పాడి ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇలా ఒకటా రెండా మూడా ఆమె చేసిన ప్రయోగాలెన్నో! మొత్తంగా ఆ గొంతులోనే ఓ ప్రయోగశాల ఉందని ప్రపంచానికి చాటి చెప్పారు.

దక్షిణ భారత గాన కోకిలగా పేరుగాంచిన ఎస్.జానకి స్వరాలకు సరికొత్త సొబగులు అద్దారు. సాహిత్యానికి వేడుక చేశారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం... ఇలా మనవైన భాషలు మొదలుకొని సింహళం, జర్మనీ, జపాన్ వరకూ 17కు పైగా భాషల్లో దాదాపు 50 వేల పాటలు ఆలపించారు. ఇందులో 16 వేల పైచిలుకు పాటలు సినిమాల కోసం ఆలపించినవే. అందుకే ఏ భాషలోకి వెళ్లినా మా జానకమ్మ అంటూ ఆమెని సొంతం చేసుకుంటారు.

**నీలి మేఘాలలో... గాలి కెరటాలలో...**

గానం, సంగీత దర్శకత్వం, రచన... ఇలా ఎన్నో రూపాలుగా తన ప్రతిభని చాటిన జానకి చదువుకోలేదు. కానీ తన పాటల ప్రయాణంలోనే ఎన్నో భాషలు నేర్చుకున్నారామె. ఊహ తెలిసినప్పటి నుంచి పాటే ఆమె ప్రపంచం. మూడో ఏట నుంచే సంగీత కార్యక్రమాల్లో పాల్గొనడం, సంగీత విద్వాంసుల దగ్గర శిష్యరికం చేయడం మొదలైంది. ఆ క్రమంలో సినిమా పాటలవైపే ఆకర్షితురాలైన జానకి... లతా మంగేష్కర్, పి.సుశీల, జిక్కి, పి.లీల పాడిన పాటలు తన కార్యక్రమాల్లో పాడటం మొదలుపెట్టారు. అక్కడ ప్రదర్శించిన ప్రతిభే ఆమెని చిత్ర పరిశ్రమకు చేర్చింది. ఏవీఎం స్టూడియోలో స్టాఫ్ ఆర్టిస్టుగా నెల జీతానికి చేరిన ఆమె... అక్కడ పాట పాడకముందే టి.చలపతిరావు సంగీత దర్శకత్వంలో 'విధియిన్ విళైయాట్టు' అనే చిత్రానికి పాట పాడారు. ఆ మరుసటి రోజే ఘంటసాలతో కలిసి 'ఎం.ఎల్.ఏ' చిత్రంలోని 'నీ ఆశ అడియాస చెయి జారే మణిపూస..' అనే విషాదగీతం పాడారు. సినీ ప్రయాణం మొదలైన తొలి ఏడాదిలోనే ఆమె ఆరు భాషల్లో ఆరు వందల పాటలు పాడారు. 'బావ మరదళ్లు' చిత్రంలోని 'నీలి మేఘాలలో...గాలి కెరటాలలో..' పాట విశేష ప్రాచుర్యం పొందడంతో అప్పట్నుంచి మరింత బిజీ అయిపోయారు జానకి. ఆరంభంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలన్నిటిలోనూ విషాద గీతాలతోనే జానకి ప్రయాణం మొదలైంది.

**ఆరు తరాల కథానాయికలతో..**

పగలే వెన్నెల జగమే ఊయల, నడిరేయి ఏ జాములో, గట్టుకాడ ఎవరో, 'పగలైతే దొరవేరా', 'ఆడదాని ఓర చూపులో..', 'జననీ... వరదాయనీ త్రిలోచనీ', 'కొండలన్నీ, కోనలన్నీ, 'మేఘమా దేహమా', 'ఆకాశం ఏనాటిదో అనురాగం ఆనాటిది, 'వెన్నెల్లో గోదావరి అందం..., తొలిసారి మిమ్మల్ని చూసిందీ...', 'పూవులు పూయును', 'గున్నమామిడి కొమ్మమీద...', 'మనసా తుళ్లిపడకే...', 'కలల అలలపై తేలే మనసు మల్లె పూవై...', 'సిరిమల్లె పూవల్లే నవ్వు..' ఇలా ఆమె ప్రయాణంలో గుర్తుండిపోయే పాటలే అన్నీ. అరుణాచలం సన్నాయితో పోటీపడి 'నీ లీల పాడెద దేవా..' అంటూ పాడారు. కోకిల గానంలోని మాధుర్యానికి దీటుగా ఉంటుంది ఆమె స్వరం. ఘంటసాల, పి.బి.శ్రీనివాస్, ఎస్పీ బాలు, ఇళయరాజా, కె.జె.ఏసుదాస్, పి.జయచంద్రన్ తదితర ప్రముఖులతో కలిసి పనిచేశారు జానకి. ఆరు తరాల కథానాయికలకు పాటలు పాడిన ఘనత ఆమె సొంతం.

**బాధని దిగమింగి పాడిన పాట**

గాయనిగా ఎంతో ఎత్తుకు ఎదిగినా.. ఎన్ని పేరు ప్రతిష్ఠలు తెచ్చుకున్నా.. భర్త చాటు భార్యనేనని చెప్పుకునేవారు ఎస్ జానకమ్మ. తానెప్పుడూ భర్త చేతుల్లోనే వెళ్లిపోవాలని భగవంతుణ్ని కోరుకున్నప్పటికీ.. ఆ కోరిక నెరవేరలేదని, తొలుత ఆయనే వెళ్లిపోయారని.. అది తన దురదృష్టమని ఓ సందర్భంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే 'కార్తీక దీపం' సినిమాలో తాను పాడిన "నీ చేతులలో తలవాల్చి" పాట వెనకున్న విషాదకర ఘటనని గుర్తు చేసుకున్నారు. ఆ పాట రికార్డింగ్ సమయానికి జానకి భర్త రాంప్రసాద్ గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కానీ, పాట రికార్డింగ్‌కి అన్ని ఏర్పాట్లు జరగడంతో దాన్ని వాయిదా వేయలేని పరిస్థితి. దీంతో జానకమ్మ ఆ కష్టాన్ని దిగమింగి.. భర్తనే తలచుకుంటూ ఎంతో ఆర్ద్రతతో "నీ చేతులలో తలవాల్చి..." గీతాన్ని ఆలపించారట.

**ముడుపుకట్టి ఆలపించిన గీతం**

తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో వేలాది సుమధుర గీతాలతో అందర్నీ అలరించిన జానకమ్మకి ఓ పాట మాత్రం ఎంతో సవాల్‌గా నిలిచిందట. ఈ విషయాన్ని ఆమె ఓ సందర్భంలో స్వయంగా పంచుకున్నారు. కన్నడ చిత్రం 'హేమావతి' కోసం తోడి, అభోగి రాగాల కలయికలో "శివ శివ ఎన్నెద" అనే గీతాన్ని సిద్ధం చేశారు ఆ చిత్ర సంగీత దర్శకుడు వైద్యనాథన్. కానీ, ఎన్ని టేకులు తీసుకుని పాట పాడినా.. దానిలోని వాద్య స్వరానికి తగ్గట్లుగా జానకి గాత్రం సంతృప్తిగా రాలేదు. దీంతో ఇక ఆమెని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక పాటలోని రాగాలు మార్చమని వైద్యనాథన్‌ని చిత్ర బృందం కోరగా.. 'ఆ పాటను ఆమె పాడలేకపోతే ఇంకెవరూ పాడలేర'ని బదులిచ్చారట. ఆ మాట విన్నాక జానకమ్మకి పట్టుదల పెరిగి రాఘవేంద్రస్వామికి.. త్యాగరాజస్వామికి చెరో రూ.100 ముడుపు కట్టి.. ఆ భగవంతుణ్ని తలచుకుని ఆ గీతాన్ని ఆలపించగా.. అది వైద్యనాథన్ కోరుకున్నట్లుగా వచ్చిందట.

**మొదటి ఆంగ్ల గీతం..**

దేశీయ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లోనూ వేలాది పాటలు పాడి మెప్పించిన జానకమ్మ... దక్షిణాదిలో తొలి ఆంగ్ల గీతాన్ని పాడిన ఘనతనూ సొంతం చేసుకున్నారు. చంద్రుడిపై మానవుడు కాలు మోపిన అపురూప ఘట్టం సందర్భంగా రూపొందించిన మ్యూజిక్ ఆల్బమ్ కోసం 1970 ఏప్రిల్ 11న 'మాన్ హాస్ సెట్ హిజ్ పుట్ ఆన్ ది మూన్" అనే గీతాన్ని పీబీ శ్రీనివాస్‌తో కలిసి ఆలపించారు.

**రామోజీరావు ప్రోత్సాహంతోనే సంగీత దర్శకత్వం**

తెలుగులో భానుమతి, పీ లీల, బీ వసంత తర్వాత సంగీత దర్శకత్వం చేసిన గాయనిగా గుర్తింపు తెచ్చుకున్నారు ఎస్ జానకి. అయితే తానిలా సంగీత దర్శకత్వం వైపు రావడానికి వెన్నుతట్టి ప్రోత్సహించిన వారు నిర్మాత రామోజీరావేనని ఓ సందర్భంలో గుర్తు చేసుకున్నారు జానకి. "ప్రతిఘటన'లో 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' పాటని పాడే అవకాశమిచ్చింది ఉషాకిరణ్ మూవీస్ సంస్థ. ఆ పాటని ఎప్పుడు గుర్తు చేసుకున్నా కన్నీళ్లు పొంగుకొస్తాయి. నా పేరు సినీ సంగీతాభిమానులు ఎప్పుడు గుర్తు చేసుకున్నా.. వాళ్లీ పాటని గుర్తు చేసుకోకుండా ఉండలేరు. ఈ పాటకి నంది పురస్కారం అందుకున్నాక.. రామోజీరావు నన్ను ప్రత్యేకంగా అభినందించారు. 'మీరు చాలా బాగా పాడారు.. అక్షరాలకు ప్రాణం పోశార'ని ప్రశంసించడం మర్చిపోలేను. ఈ సంస్థలో మూడొంతుల సినిమాలకి పాటలు పాడే భాగ్యం దక్కింది. నన్ను సంగీత దర్శకురాలిగా మార్చింది కూడా ఈ సంస్థే. నేను స్వరాలు సమకూర్చిన ఒకే ఒక్క చిత్రం 'మౌనపోరాటం'. ఉషాకిరణ్ సంస్థపై నాకున్న గౌరవం.. వాళ్లు నాపై చూపే అభిమానం కారణంగానే ఆ చిత్ర సంగీత బాధ్యతల్ని భుజానికెత్తుకున్నా. రామోజీరావు నిర్మించే సినిమాల్లో సంగీతానికి ప్రాధాన్యం ఉంటుంది. మంచి పాటలుంటాయి. ఇలా మంచి పాటలు, ఉత్తమ సాహిత్యం బొత్తిగా కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఈ సంస్థ సంగీతానికి ప్రాధాన్యతనిస్తూ మంచి సినిమాల్ని నిర్మించాలని నా అభిలాష" అని చెప్పుకొచ్చారు జానకి.

**గళంతో గారడి చేయడం అలా మొదలైంది**

గళంతో గారడి చేస్తూ.. సినీ సంగీత ప్రియుల్ని పాటల పూదోటలో విహరింపజేయడంలో దిట్ట ఎస్ జానకమ్మ. పిల్లల్లా గాత్రం మార్చి పాటలతో అల్లరి చేయాలన్నా.. వయసు పైబడిన ముదుసలిలా స్వరంలో భావాలు ఒలికించాలన్నా ఆమెకి ఆమే సరిసాటి. ఇలా వైవిధ్యభరితమైన స్వరంతో ఆమె చేసే మాయల్ని చూస్తే ఎవరికైనా తను మిమిక్రీ నేర్చుకుందేమోననే అనుమానం కలుగక మానదు. అయితే తనిలా స్వరాన్ని మార్చి పాటలు పాడటం వెనకున్న అసలు కథని ఓ సందర్భంలో పంచుకున్నారు. "అందరూ అనుకున్నట్లు నాకు మిమిక్రీ రాదు. కానీ, ఓసారి మద్రాస్‌లో జరిగిన ఓ వేడుకలో పాటలు పాడుతుంటే అక్కడున్న చాలామంది పిల్లలు బోర్‌గా ఫీలవడం చూశా. దీంతో వాళ్లని ఉత్సాహపరిచేందుకు పిల్లల్లా స్వరం మార్చి పాటలు పాడా. అదే వేడుకకు వచ్చిన ఓ తమిళ నిర్మాత ఆ పాటలు విని.. తన సినిమా 'రుసి కందపూణై' సినిమాలో ఇలా ఓ పాట పాడాలని కోరారు. అలా ఆ చిత్రం కోసం పూర్తిగా ఆరేళ్ల గొంతుకతో "కణ్ణా నీ ఎంగే.." పాట పాడా. అది ఇళయరాజాకి నచ్చడంతో నన్ను బాగా ప్రోత్సహించారు. తన సినిమాల్లో పిల్లల స్వరాలతో చాలా పాటలు పాడించారు. తెలుగులో 'సప్తపది'లో 'గోవుల్లు తెల్లన.." పాటని చిన్న పిల్లాడిలా పాడా. అవన్నీ నాకెంతో పేరు తెచ్చాయి" అని ఆమె జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు.

ఆయన లేనిదే నేను లేను.. నా పాటా లేదు!

తేనెలూరె స్వరంతో సినీ సంగీత ప్రియుల హృదయాలపై చెరగని ముద్ర వేసిన సంగీత రాజ్ఞి జానకమ్మ. అయితే ఆమె ఈ గాన ప్రపంచంలోకి అడుగు పెట్టడం వెనుక అమ్మ నేర్పిన పాట.. ఆమెను నడిపించిన శ్రీకృష్ణుడి బాటే తనకు స్ఫూర్తిగా నిలిచాయని ఓ సందర్భంలో గుర్తు చేసుకున్నారు. "నేను ఎన్ని భాషల్లో.. ఎన్ని వేల గీతాలు ఆలపించినా అదంతా ఆ కృష్ణపరమాత్ముడు నాకందించిన కృపా కటాక్షమే. ఆయనే నా వెనకుండి నాతో ఇన్ని పాటలు పాడించాడని నేనెప్పుడూ నమ్ముతా. ఆ వేణుగానలోలుడు లేనిదే నేను లేను.. నా పాటా లేదు. నాకు సంగీతంపైన.. ఆ కృష్ణుడిపైనా ప్రేమ పుట్టడానికి ముఖ్య కారణం మా అమ్మే. ఆమె పరమ కృష్ణ భక్తురాలు. ఆమెకి ఆ గోపికా మనోహరుడిపై ఉన్న భక్తి భావాన్నంతా తనకొచ్చిన రీతిలో పాటలుగా పాడుతుండేది. చిన్నతనంలో వాటిని నేనెంతో శ్రద్ధగా ఆలకించేదాన్ని. అలా ఆమె పాటలకే కాదు.. తను ఆరాధించే ఆ గోపాలుడికి భక్తురాలినైపోయా" అంటూ బాల్య జ్ఞాపకాల్ని పంచుకున్నారు జానకి. గానం, సంగీత దర్శకత్వమే కాకుండా... ఆమె భక్తి గీతాల్ని రచించారు. 1980లో తమిళ చిత్రం 'రుసి కండపూనై' కోసం పాటల రచయిత్రిగా తొలిసారి కలం చేతపట్టారు.

**తమిళంలోనే తొలి అవకాశం**

ఆంధ్రప్రదేశ్‌లో జానకి జన్మించినా సంగీత జీవితాన్ని ప్రారంభించడానికి చెన్నైకు మకాం మార్చారు. 1957వ ఏడాది విడుదలైన 'విధియిన్ విళైయాట్టు' చిత్రంలో 'ఎన్ ఆశై పాళానదు ఏనో..' అనే పాటను పాడి నేపథ్య గాయనిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాతే ఆమెకు తెలుగు చిత్రంలో పాడేందుకు అవకాశం లభించింది.

ఇళయరాజా తొలిసారి సంగీతం అందించిన 'అన్నకిళి' చిత్రంలోని 'అన్నక్కిళి ఉన్నై తేడుదే..' పాటను పాడి తన స్వరమాధుర్యంతో తమిళులను మైమరిపించారు.

తమిళంలో ఎం.ఎస్.విశ్వనాథన్, ఇళయరాజా, ఎ.ఆర్.రెహమాన్ లాంటి పలు తరాల దిగ్గజ సంగీత దర్శకులతో పనిచేసి అత్యుత్తమ పాటలను తన గళం నుంచి

# విశ్వ నగరంగా ఒంటిమిట్ట ,

**•సీఎంచంద్రబాబు మాజీ ఎమ్మెల్యేరత్న సభాపతి విగ్రహాలు ఏర్పాటు -రాజంపేట టిడిపి ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు**





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 12:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట ను విశ్వ నగరంగా అభివృద్ధి చేస్తామని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. ఒంటిమిట్టలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాజీ ఎమ్మెల్యే దివంగత రత్న సభాపతి విగ్రహం లక్ష్మీ నరసింహ స్వామి గుడి ఏర్పాట్లు స్థలాన్ని టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చామర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల వెంకన్న శ్రీశైలం మల్లన్న ఒంటిమిట్ట రామన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయన్నారు. ఒంటిమిట్ట కోదండ రాముని కళ్యాణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటిమిట్ట అభివృద్ధికి డెవలప్మెంట్ అథారిటీని ప్రకటించారన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక దేవాలయం గా ప్రకటించి కోదండ రాముని కళ్యాణి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించడానికి ఎత్తిపోతల పథకం పునర్ నిర్మాణానికి 12 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధులు కేటాయించారు. ఒంటిమిట్ట చెరువులో జాంబవంతుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 భాగంగా ఒంటిమిట్ట తో పాటు రాజంపేట నియోజకవర్గం లో పరిశ్రమలు ఏర్పాటు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లకుండా యువతకు ఉద్యోగ అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించనున్నారని పేర్కొన్నారు. ఒంటిమిట్ట అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషికి చిహ్నంగా చంద్రబాబు నాయుడు విగ్రహం రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే దివంగత రత్న సభాపతి ఏర్పాటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెంచలయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట రాములోరి చెంత తాను సొంతంగా కోటి రూపాయల వ్యయంతో లక్ష్మీ నరసింహ స్వామి గుడిని నిర్మించి టీటిడికి అప్పజెప్పట్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, కార్యదర్శి ఆలూరి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జి తుమ్మలగుంట ఈశ్వరయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెంచలయ్య, బొబ్బిలి రాయుడు, స్పెషల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్వీ రమణ, సాలాబాద్ బుజ్జి, శ్రీహరి, రోశయ్య, బాలమునియ్య, గఫూర్, చంద్రపాల్ ,నరసింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యవంతమైన పిల్లల కోసం -నులిపురుగులను నిర్మూలిద్దాం.

**---డీఎంహెచ్వో డా. సీహెచ్. ధనరాజ్**



**జన సముద్రం న్యూస్ సిద్దిపేట జూలై 13:(కోహెడ ప్రసాదరావు)**
ఆరోగ్యవంతమైన పిల్లల మనుగడ కోసం నులిపురుగులను నిర్మూలించాలని
సి హెచ్ ధనరాజ్ అన్నారు
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పలు కార్యక్రమాన్ని నిర్వహించాను అన్నట్లు డి ఎం హెచ్ ఓ సిహెచ్ ధనరాజ్ తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 13 వ తేదీని జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం గా జరుపుకుంటారని ఆయన తెలిపారు.

డీఎంహెచ్వో ధనరాజ్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆల్బెండజోల్ మందుల పంపిణీ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ సర్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలో 1 సంవత్సరంవయస్సు నుండి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన (2,12,569) మంది పిల్లలందరికీ జూలై 13, 2026న, జిల్లాలో మొత్తం 2461 పంపిణీ కేంద్రాలలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల లో ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.13 జులై రోజున మాత్రలు తీసుకోలేని పిల్లలకు మళ్లీ జూలై 20, 2026న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు.

1-2 సంవత్సరం ల వయస్సు గల పిల్లలకు 1/2 టాబ్లెట్( నిబంధనల ప్రకారం వేయబడును ) 2 సంవత్సరముల నుండి19 వయసుగల పిల్లలకు 1 టాబ్లెట్.( నిబంధనల ప్రకారం టాబ్లెట్లు వేయబడును ). ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎటువంటి హానికరమైన దుష్ప్రభావాలు ఉండవని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు గురికాకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించాలని కోరారు. విద్యాశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ మరియు ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, బలహీనత, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. నులిపురుగుల నివారణకు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, గోర్లు కత్తిరించుకోవడం, పరిశుభ్రమైన నీరు తాగడం, ఆహారాన్ని మూతపెట్టి ఉంచడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వినియోగించడం, పాదరక్షలు ధరించడం, బహిరంగ మలవిసర్జనకు బదులుగా మరుగుదొడ్లను వినియోగించడం వంటి పరిశుభ్రత చర్యలు పాటించాలని సూచించారు.

# రాంపల్లి సర్వే నం. 226లో కుమ్మరి, వడ్డరి, ఎరుకల వంటి పనిముట్ల కులాలకు గతంలో ప్రభుత్వం సుమారు 8 ఎకరాల భూమిని కేటాయించింది.





**కీసర మండల్, మేడ్చల్ జిల్లా, జనసముద్రం న్యూస్. ఎస్ బాలకృష్ణ రెడ్డీ :**
ప్రస్తుతం అదే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేయడాన్ని గ్రామస్థులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం శ్యామసుందర్ శర్మ ఆధ్వర్యంలో కుమ్మరి--వడ్డరి--ఎరుకల పనిముట్ల సంఘాల ప్రతినిధులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను రక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా ఈ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల జీవనాధారం ఈ భూములతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న కాలనీ మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హానికరమని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కీసర ఆర్డీఓతో ఫోన్లో మాట్లాడిన శ్రీ ఈటెల రాజేందర్, రాంపల్లిలో కుమ్మరి, వడ్డరి, ఎరుకల కులాల జీవనాధారానికి సంబంధించిన భూముల జోలికి వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తాను స్వయంగా రాంపల్లికి వచ్చి ధర్నాలో పాల్గొని ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా కుమ్మరి, వడ్డరి, ఎరుకల సంఘాల కోసం ఎంపీ నిధుల ద్వారా మొత్తం రూ.30 లక్షలు (ప్రతి సంఘానికి రూ.10 లక్షలు చొప్పున) కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి మంజూరు చేసినట్లు శ్రీ ఈటెల రాజేందర్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ మునిగంటి సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు బొమ్మిడి బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామారం గిరి గౌడ్, భరత్ ముదిరాజ్, మల్యాల మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాస శివరాత్రి సందర్భంగా రుద్రేశ్వర స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా

**-- పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు రావు అమరేందర్ రెడ్డి**



కళ్యాణం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ

**హనుమకొండ, జూలై 12 (జనసముద్రం):**
నిజ జ్యేష్ఠ మాస మాస శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల) దేవాలయంలో ఆదివారం స్వామివారి మాస కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆదివారం సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి రుద్రేశ్వర స్వామి, రుద్రేశ్వరీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ప్రాతఃకాల నిత్యారాధనల అనంతరం ఉత్తిష్ఠ గణపతి ఆరాధన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నాట్య మండపంలో రుద్రేశ్వరీ--రుద్రేశ్వర స్వామివార్ల మాస కళ్యాణోత్సవాన్ని వేదోక్తంగా, ఆగమశాస్త్ర విధానంలో వైభవంగా జరిపారు.ఈ సందర్భంగా పుణ్యాహవాచనం, మండపారాధన, జ్యోతి ప్రజ్వలన, అంకురారోపణ, మహాసంకల్పం, పాదపూజ, చూర్ణిక, లగ్నాష్టకాలు, అక్షితారోహణ, పుష్పార్చన, నీరాజనం, మంత్రపుష్పం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం స్వామివారి తీర్థప్రసాదం, తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ ఆధ్వర్యంలో, ఆసిఫాబాద్కు చెందిన వేదపండితుడు వెంకటేశ్వర శర్మ కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రావు అమరేందర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చైనాలో బంగారు పతకం సాధించిన డిండి వాసి ప్రవళిక







**జనసముద్రం న్యూస్ జూలై 12: డిండి :-**
చైనాలోని ఓర్డోస్లో జరిగిన 1వ ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్స్-2026లో మహిళల 4x400 మీటర్ల రిలే బృందంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రానికి చెందిన నారిమల్ల ప్రవళిక అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం సాధించింది.ఈ సందర్భంగా గ్రామీణ క్రీడా కెరటం నారిమల్ల ప్రవళికకు గ్రామస్తులు,రాజకీయ ప్రముఖులు బంధుమిత్రులు ,స్నేహితులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.డిండి లోని ఆర్ పి ఆర్ పి గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తూ,గురుకుల స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థిని అయిన ప్రవళిక అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయడమే కాకుండా డిండికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చిందని గ్రామస్తులు కొనియాడారు.ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ప్రవళిక అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం మన గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ప్రవళిక కనబరిచిన అద్భుతమైన ప్రతిభే నిదర్శనం.డిండి ఆడబిడ్డ అంతర్జాతీయ క్రీడా వేదికపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం భారతదేశానికి గర్వకారణమని ప్రవళిక హర్షం వ్యక్తం చేశారు.డిండి మైదానంలో కఠినమైన శిక్షణ పొంది చైనా వేదికగా బంగారు పతకం గెలవడం తెలంగాణలోని వేలాది మంది యువ క్రీడాకారులకు ఆమె ఎంతో స్ఫూర్తిదాయకం. పరుగుల చీతాగా భారతదేశం పేరును ప్రపంచ పటంలో నిలబెడుతున్న ప్రవళికను కన్న తల్లిదండ్రులైన నారిమల్ల రాంబాబు (తాపీమేస్త్రి) విజయ(కూలి) దంపతులను పలువురు అభినందించారు

# ఎల్కతుర్తి పెద్దమ్మ తల్లి గుడికి కొత్త కమిటీ ఏర్పాటు

**కంబాల శ్రీను చైర్మన్గా ఏకగ్రీవ ఎన్నిక**



**ఎల్కతుర్తి, జులై 12(జనసముద్రం)**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో ఆదివారం ముదిరాజ్ సంఘం పెద్దల ఆధ్వర్యంలో గుడి కమిటీ ఎన్నికలు నిర్వహించారు.కంబాల రమేష్, బొజ్జ సతీష్, కాటంరాజు, బొజ్జ గోపాల్, బొజ్జ రవీందర్ సమక్షంలో జరిగిన సమావేశంలో గుడి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీలో చైర్మన్గా కంబాల శ్రీను, వైస్ చైర్మన్గా బొజ్జ శ్రీధర్, క్యాషియర్గా బొజ్జ నవీన్ ఎన్నికయ్యారు.కమిటీ డైరెక్టర్లుగా పోలు కిరణ్, బొజ్జ తిరుపతి, బొజ్జ స్వామి, సతీష్ మేస్త్రి, కిరణ్, రాహుల్, పోలు పవన్ కుమార్, ఓం తేజ, చందులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ముదిరాజ్ సంఘం పెద్దలు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి గ్రామోత్సవం.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి మాస శివరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన స్వామివారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది. ఉత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై కొలువు తీర్చారు. అనంతరం స్వామివార్లకు వివిధ రకాల నూతన వస్త్రాలు, విశేష పుష్ప మాలలతో నయనానందకరంగా అలంకరించి, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత స్వామివారికి మంగళ హారతులు ఇచ్చి, వేద మంత్రోచ్చారణల నడుమ గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

క్షేత్ర పురవీధుల్లో నిర్వహించిన స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. మంగళవాయిద్యాలు, భక్తుల హరహర మహాదేవ' శివనామ స్మరణలతో ద్వారకాతిరుమల పురవీధులు మారుమోగాయి. ముందుగా ఉదయం గర్భాలయంలో కొలువై ఉన్న స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దివ్య క్షేత్రం భద్రాద్రిలో ఈనాడేప్రభుత్వ సలహాదారు హనుమంతరావు గారి మౌన దీక్ష.



**జనసముద్రం న్యూస్ జూలై 12 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**
అయోధ్య రామాలయం లో జరిగిన ఆర్థిక దోపిడీపై నిరసన వ్యక్తం చేస్తూ సీనియర్ కాంగ్రెస్ నేత తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీ వి హనుమంతరావు దక్షిణ అయోధ్యగా ప్రఖ్యాతి చెందిన దివ్య క్షేత్రం భద్రాచలంలో సోమవారం మౌన దీక్ష నిర్వహిస్తున్నారుఅయోధ్య బాల రామునికి భద్రాద్రి రాముడు న్యాయం చేయాలని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ప్రార్థిస్తూ దీక్ష చేపడుతున్నట్లు రామభక్త హనుమంతుడైన హనుమంతరావు తెలియజేశారు. శ్రీరామకార్యం కోసంమౌన దీక్ష శుభ పరిణామమే అయినప్పటికీ భద్రాచలం రామాలయంలో సీతారాముల కళ్యాణం, మరియు భద్రాద్రిలో నిర్వహిస్తున్న ఇతరపూజా దికాలలో అసత్య గోత్ర ప్రవరలు చెపుతున్నారని, మహా సాధ్వి సీతామాతను పెండ్లి కుమార్తెగా వర్ణిస్తూ, పెండ్లి కుమారునిగా ఏకపత్నీ వ్రతుడైన శ్రీరామచంద్రుని పేరు చెప్పకుండా బహు భార్యలు ఉన్న నారాయణని పెండ్లి కుమారునిగా చెప్తూ సీతారాములకు తీవ్ర అపచారం చేస్తున్నారని, ఈ విషయంలోశ్రీరామ భక్తులు తీవ్ర మనోవ్యధ చెందుతున్నారని, శ్రీరామభక్తాగ్రన్యుడైన శ్రీ హనుమంతుని నామ0 పెట్టుకున్న శ్రీ హనుమంతరావు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి భద్రాద్రిలో జరుగుతున్న రామాపచారాన్ని సరి దిద్దాలని రామభక్తులు కోరుతున్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై బి ఎల్ ఏ లతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జులై 13**
కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ఆల్విన్ కాలనీ, మియాపూర్ , హఫీజ్ పేట డివిజన్లకు సంబంధించి ఎస్. ఐ. ఆర్ ఓటర్ నమోదు ప్రక్రియపై బి ఎల్ ఎ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని ఏమైనా సందేహాలు ఉన్న ఎడల వారికి అందుబాటులో ఉండి నివృత్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని. ఎవరైనా ఓటు నమోదు కోసం ఆఫీసర్లు వారి ఇంటికి వెళ్ళినప్పుడు వారు అందుబాటులో లేని ఎడల తిరిగి మళ్లీ వారికి సంప్రదించి వారి ఓటు హక్కును కూడా కాపాడాల్సిన బాధ్యత చూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.. ఏమైనా ఇబ్బంది ఉన్న ఎడల తన ను నేరుగా సంప్రదించవచ్చని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారని సూచించారు.. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గం నాయకులు బి ఎల్ ఎ లుపాల్గొన్నారు

# 73 మంది అనారోగ్య బాధితులకు రూ.63 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి మండిపల్లి

**రాయచోటి జనసముద్రం న్యూస్ జూలై 12**

రాయచోటి పట్టణంలోని మంత్రి గారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఌ క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గ అబ్జర్వర్ అన్నా అనిత యాదవ్ తోలి కలిసి 73 మంది అనారోగ్య బాధితులకు మొత్తం రూ.63 లక్షల విలువైనలి ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసాగా



నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి త్వరితగతిన సహాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల కష్టకాలంలో అండగా నిలవడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని అన్నారు.రాయచోటి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా నిరంతరం కృషి చేస్తున్నామనిలి మంత్రి గారు తెలిపారు. అర్హత



ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రజల సంక్షేమమే తమ రాజకీయాల లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతురాలైన విద్యార్థినికి ఆర్థిక

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉన్నత చదువులకు ఎమ్మెస్సార్ ట్రస్ట్ అండగా నిలుస్తోంది. ద్వారకాతిరుమల మండలంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన జి. కొత్తపల్లి ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థిని కేత హారికకు, ఎమ్మెస్సార్ ట్రస్ట్ ఆర్థిక చేయూతనందించింది.ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ తెలుగుదేశం పార్టీ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు మొగతడకల శ్రీనివాసరావు పాల్గొని, విద్యార్థిని తదుపరి విద్యాభ్యాసం కోసం శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ కాలేజీ ఫీజు నిమిత్తం రూ. 25,600/- విలువైన డిమాండ్ డ్రాఫ్ట్ డిడిను విద్యార్థిని తండ్రి కేత మురళికి అందజేశారు.ఈ సందర్భంగా మొగతడకల శ్రీనివాసరావు మాట్లాడుతూ..."పేదరికంతో చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతోనే మా ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు సహాయం చేస్తున్నాం. హారిక భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి"



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెస్సార్ దంపతులు.

అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు మొగతడకల లక్ష్మీ రమణి, వారి కుమారులు మొగతడకల సంజీవ్ చౌదరి, మండల విద్యాశాఖ అధికారి పరస వెంకట్రావు, జి. కొత్తపల్లి ఓరియంటల్ హైస్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాసు, మరియు ద్వారకాతిరుమల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాకనాటి శేష బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ గాయని ఎస్.జానకి మృతి పట్ల సంతాపం తెలిపిన నవులూరి శివారెడ్డి

**జనసముద్రం న్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సత్తెనపల్లి నియోజకవర్గం, జూలై 12;**



ఎస్.జానకి,ప్రముఖ గాయని.

దక్షిణ గాన కోకిలగా ప్రసిద్ధి చెందిన ఎస్.జానకి మృతి పట్ల అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఆమె 48 వేలకు పైగా పాటలు పాడారు అని, దక్షిణాది గాన కోకిల గా ప్రసిద్ధి చెందిందని, మలయాళం, హిందీ, తెలుగు తమిళం తదితర 17కు పైగా భారతీయ భాషలలో పాటలు పాడారని, జపనీస్, జర్మనీ భాషల్లో కూడా ఆమె పాటల పాడటం, మన గుంటూరు జిల్లా రేపల్లె వాసి కావడం విశేషం అని అన్నారు. ఎలాంటి శాస్త్రీయ సంగీత శిక్షణ లేకుండానే అద్భుతమైన తన గాత్రంతో లక్షలాదిమందిని మంత్రముగ్ధులను చేశారని, ఆమె పాట పాడేటప్పుడు భావోద్వేగ్యాలను అద్భుతంగా పలికించేవారని, ఇళయరాజా సంగీతంలో ఆమె పాడిన పాటలు చిరకాల నిలిచిపోతాయని శివారెడ్డి అన్నారు. ఆమె లేని లోటు సంగీత ప్రియులకు తీరని లోటేనని పేర్కొన్నారు.



నవులూరి శివారెడ్డి, అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

# అనారోగ్యంతో బాధపడుతున్నా టీడీపీ కార్యకర్తకు భరోసా కల్పించిన మంత్రి మండిపల్లి





**లక్కీరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 12**

లక్కిరెడ్డిపల్లి మండలం పాలెం మామిడిగారిపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రంగాని మునిస్వామి నాయుడు స్లీపింగ్ పెరాలసిస్ వ్యాధితోలి కాళ్లు, చేతులు పనిచేయని స్థితిలో మంచానికే పరిమితమై ఉండటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఌ క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మునిస్వామి నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయం, అర్హత మేరకు పెన్షన్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ కుటుంబానికి భరోసా కల్పించారు.

# బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు





**మొగల్తూరు జూలై 12 జనసముద్రం ప్రతినిధి**

మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, "జై ముత్యాలమ్మ తల్లి" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసి, తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ వంటి సౌకర్యాలను కల్పించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం తాటి చెట్టు రూపంలో ఆరాధించబడే విశిష్ట గ్రామదేవత ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

# సైబర్ నేరాల పై జాగ్రత్తలు వహించాలి : మాచర్ల పోలీస్ వారు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూలై 12;**





మాచర్ల పట్టణంలోని 8వ వార్డు రూఫ్ లైన్ కాలనీ నందు ప్రజలు మరియు యువత ఎటువంటి గొడవలకి కానీ, మాదకద్రవ్యాలు, గంజాయి, మందు, పేకాట లాంటి వ్యసనాలకి బానిస కా కూడదు అని, సైబర్ నేరాల పై జాగ్రత్తలు తీసుకోవాలని మాచర్ల పట్టణ పోలీసు వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ సిఐ ఎస్కే. నజీర్ బేగ్, పట్టణ ఎస్ఐ వెంకట్రావు, మహిళా ఎస్ఐ, పలువురు పోలీసు అధికారులు, మాచర్ల నియోజకవర్గం టీడీపీ అధికార ప్రతినిధి చల్లా రాజారత్నం మరియు వార్డు లోని టీడీపీ నాయకులు, ప్రజలు, యువత పాల్గొనటం జరిగింది.

# సర్పంచ్ లక్ష్మణ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన రామకృష్ణ



**జనసముద్రంన్యూస్, జూలై 12;**

రాంపురం సర్పంచ్ లక్ష్మణ్ కి బాలాజీనగర్ తండా కి చెందిన మెగావత్ రామకృష్ణ నాయక్ శాలువాతో సత్కరించి, తన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... లక్ష్మణ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ నీపై ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# చిన్న వెంకన్న సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మేడమల్లి బాలాజీ దంపతులు ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, పండితులు తూర్పు వైపు గాలిగోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు .స్వామివారి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను ,శేష వస్త్రాన్ని సమర్పించారు.ఏఈవో మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను అందించారు. వీరితోపాటు ఆలయ అధికారులు,సూపర్నెంట్ ఐవి. రామారావు, అర్చకులు , ఎస్పై టి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి : నవులూరి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, జూలై 12;**

ఇటీవల ముంబైలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి ఆకాంక్షించారు. తిరిగి మళ్లీ ఆయన ఎప్పటిలాగే ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



నవులూరి శివారెడ్డి, అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

# మద్యం షాపుల్లో సిండికేట్ దందా..!




- ఎమ్మార్పీ ధరకు మించి విక్రయాలు.. రూ.20 నుంచి రూ.40 అదనంగా వసూలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- మందుబాబులు గగ్గోలు

**భీమవరం జూలై 12 జనసముద్రం ప్రతినిధి**

భీమవరం పరిసర ప్రాంతాల్లో పలు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో మద్యం సీసాపై రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు, వారాంతాలు, రద్దీ సమయాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అదనపు ధరలు చెల్లించకపోతే మద్యం ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, బిల్లులు కూడా సరిగా ఇవ్వడం లేదని కొందరు వినియోగదారులు చెబుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరిగేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# చిత్రదుర్గం నుండి హైదరాబాద్ ప్రైవేట్ సర్వీస్ ప్రారంభం...

**-వయా కుందుర్పి మిదుగా సుధీర్ ట్రావెల్స్ ఏసి స్లిపర్ బస్సు కొనసాగింపు.**

**-కుందుర్పి నుండి హైదరాబాద్ కు పోవటానికి టికెట్ ధర రూ,1200లు,,రావడానికి రూ,899లు చెల్లించాలి.**

**-కర్నాటక అంతరాష్ట్ర సర్విసు నడపడం వల్ల ప్రజలు హర్షం వ్యక్తం.**

**-మండల ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలి...**

**కుందుర్పి జూలై, 12 ,జనసముద్రం న్యూస్ ;.**

ప్రయాణికుల సౌకర్యం కొరకు కర్ణాటకలోని చిత్రదుర్గమ్మ నుండి హైదరాబాద్ కు అంతర్ రాష్ట్ర ప్రైవేట్ ఏసి సీప్లర్ నూతన సర్వీస్ బస్సు ఇటీవలే ఈ రహదారి పైన




ప్రారంభమై సంచరిస్తుందని ప్రయాణికులు, నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలోనే తొలత హైదరాబాద్ నుండి చిత్రదుర్గంకు సుధీర్ ట్రావెల్ బస్సు ఆధ్వర్యంలో రాత్రి 9;50 పది యాభై నిమిషాలకు బయలుదేరుతుందని అన్నారు. తద్వారా స్పీపర్ సర్వీస్ బస్సు వయా కుందుర్పి మీదుగా ఉదయం 6:30 కు చేరి, 8:30 నిమిషాలకు చిత్రదుర్గం జిల్లాకు చేరుతున్నట్టు సమాచారం తెలుస్తుంది.తిరిగి చిత్రదుర్గం -కుందుర్పిలో రాత్రి 9గంటలకు అదే బసు బయలు దేరి ఉదయం 6గంటలకు హైదరాబాద్ చేరుతుంది. కాగా తిరిగి హైదరాబాద్ నుండి కుందుర్పికి ఎడున్నర గంటల వ్యవధిలోనే ఈ సర్వీస్ ప్రయాణికులును వారివారి గమ్యస్థానంకు చేరవేస్తుంది. అనంతరం చిత్రదుర్గం నుండి హైదరాబాదుకు బసు రాత్రి 7 గంటలకు అక్కడ బయలుదేరి తిరిగి కుందుర్పి గ్రామం కు రాత్రి 9 గంటల సమయం లో చేరుతుందని ప్రజలు తెలియజేశారు. ఇక్కడనుండీ అనంతపురంకు రాత్రి 11గంటలకు చేరి ఉదయం 6గంటలుకు హైదరాబాద్ కు చేరుతుందని సమాచారం తెలిసింది. కుందుర్పిలో ఈ బసును కేవలం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కేంద్రంతోనే నిలుపుతారు. ఈ సర్వీస్ ప్రైవేట్ ట్రావెల్స్ ఏసి స్లీపర్ బస్సును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రయాణికుల సౌకర్యం నిమిత్తం సమయపాలన సురక్షిత సౌకర్యవంతమైన ప్రయాణం మీ సేవలోనే సుదీర్ ట్రావెల్స్ సర్వీస్ కొనసాగుతుందని పేర్కొన్నారు. హైదరాబాదులో ప్రయాణం చేసే ప్రయాణికులను కూకట్ పల్లి ,అమీర్ పేట, లకిడికపూర్, కాచిగూడ, కేంద్రం ప్రాంతాలలో డ్రాపింగ్ చేస్తారు. తిరిగి జె,యన్,టి,యు,మాయపూర్, ఆల్విన్ రోడ్డు, కొండాపూర్, గాచ్చిబౌలి , కేంద్రాలలో ప్రయాణికులును పికప్ చేసుకొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. కుందుర్పి నుంచి హైదరాబాద్ కు పోవు చార్జ్ రూ,1200కలదని, హైదరాబాద్ నుండి కుందుర్పికి రాను చార్జీ రూ,899లు కలదని పేర్కొన్నారు. చిత్రదుర్గం – హైదరాబాద్ కు పోవు చార్జి రూ,1299లును, హైదరాబాద్ నుంచి చిత్రదుర్గంకు రాను చార్జి రూ,998 లు కలదని తెలిసింది. ఈ మంచి లాంగ్ సర్వీస్ బస్సును హైదరాబాద్ నుంచి చిత్రదుర్గంకు వయా కుందుర్పి మీదుగా సర్వీస్ నడిపి నందుకు నిర్వాకులుకు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రయాణికులు సీటు బుక్ చేసుకోవడానికి కళ్యాణ దుర్గం కార్యాలయం చరవాణి నంబరు 88 86 11 17 62 ను సంప్రదించాలని కోరారు.

# భీమవరంలో ట్రాఫిక్ జామ్

## ప్రధాన రహదారులు ప్రైవేట్ సంస్థల కంట్రోల్లోకి వెళుతున్నాయా?

**భీమవరం జులై 12 జనసముద్రం ప్రతినిధి**




భీమవరం పట్టణంలోని ప్రధాన రహదారులపై రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ముఖ్యంగా షాపింగ్ మాల్స్‌కు తగిన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వినియోగదారులు తమ ఫోర్ వీలర్, టూ వీలర్ వాహనాలను రహదారిపైనే పార్క్ చేస్తున్నారు. భీమవరం పాత బస్టాండ్ వెనుక బొంబే స్వీట్ కూడలి వద్ద ప్రధాన రహదారిపై నిత్యం రద్దీ కొనసాగుతూ ఉంటుంది దీంతో రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
రద్దీ సమయాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవల వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపింగ్ మాల్స్‌కు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, రహదారులపై అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ద్వారకాతిరుమలలో భక్తులకు తప్పని తిప్పలు..

**•నడక మార్గంలో అడ్డంగా ట్రాక్టర్-ట్రక్కు ..**

**•సిబ్బంది నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం.**

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో భక్తుల సౌకర్యాలను గాలికొదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు అత్యంత పవిత్రంగా భావించే పాదుకా మండపం సమీపంలోని ప్రధాన నడక మార్గంలో, దేవస్థానానికి చెందిన ట్రాక్టర్-ట్రక్కును అడ్డంగా నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనం అడ్డంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం



**రోడ్డు మధ్యలో టాక్టర్ ట్రక్కు. భక్తులు వెళ్లలేక ఇబ్బందులు.**

కలిగింది. భక్తులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని దేవస్థాన సిబ్బంది తీరుపై అక్కడి భక్తులు నిరసన వ్యక్తం చేశారు. వాహనాన్ని పక్కకు తీయాలని కోరిన భక్తులకు, అక్కడే విధుల్లో ఉన్న సిబ్బంది నుండి ఎదురైన సమాధానం మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. "మా ఇష్టం.. ఎక్కడైనా పెడతాం" అంటూ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని భక్తులు ఆరోపిస్తున్నారు.తిరుమల తరహాలో ద్వారకాతిరుమలను తీర్చిదిద్దుతామని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో సిబ్బంది ప్రవర్తన మాత్రం భక్తులను విస్మయానికి గురిచేస్తోంది. పాదుకా మండపం వంటి కీలక ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి వాహనాలను ఇష్టానుసారంగా ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.భక్తుల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా వాహనాలను పార్క్ చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా సిబ్బందికి తగిన సూచనలు చేయాలని పలువురు భక్తులు ఆలయ ఉన్నతాధికారులను కోరుతున్నారు. పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో క్రమశిక్షణను పాటించాల్సిన సిబ్బందే ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై దేవస్థానం ఉన్నతాధికారులు స్పందించి, తదుపరి చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి.

# అనారోగ్యంతో బాధపడుతున్నా టీడీపీ కార్యకర్తకు భరోసా కల్పించిన మంత్రి మండిపల్లి

**లక్కీరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 12**





లక్కిరెడ్డిపల్లి మండలం పాలెం మామిడిగారిపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రంగాని మునిస్వామి నాయుడు స్లీపింగ్ పెరాలసిస్ వ్యాధితోలి కాళ్లు, చేతులు పనిచేయని స్థితిలో మంచానికే పరిమితమై ఉండటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఌ క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మునిస్వామి నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల సహాయం, అర్హత మేరకు పెన్షన్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ కుటుంబానికి భరోసా కల్పించారు.

# లక్కిరెడ్డిపల్లి పాలెం లో మంత్రి సుడిగాలి పర్యటన

**లక్కీరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 12**

లక్కిరెడ్డిపల్లి మండలం పాలెం గొల్లపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొగ్గినేని మల్లికార్జున గారు గంగమ్మ అమ్మవారికి మొక్కుబడిగా నిర్వహించిన బోనాల సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఌ క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గ్రామానికి విచ్చేసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.
అనంతరం గ్రామ ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించిన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాలెం ఎగువపల్లి రోడ్డు నుంచి పాలెం నడింపల్లి వరకు సుమారు 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించాలనిలి గ్రామస్తులు కోరగా, వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి గారు సీసీ రోడ్డు మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.
గ్రామంలో విద్యుత్ అంతరాయం, అధిక లోడ్ కారణంగా ఎదురవుతున్న సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికిలి





తీసుకురాగా, వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
గ్రామంలో పర్యటించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలతో కలిసి మమేకమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు తదనంతరం అదే గ్రామానికి చెందిన తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘమ్ కాన్వీనర్ వీరాంజనేయులు ఇచ్చిన తేనిటీ విందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె తెలుగుదేశం అధ్యక్షుడు యనమల మదన్మోహన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎస్ఎండి సేఫినాయక్,రాష్ట్ర అటవీశాఖ డైరెరెక్టర్ రెడ్డెయ్య యాదవ్, టిడిపి నాయకుడు మాజీ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు మండిపల్లి అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# రైల్వే క్వార్టర్స్ లైన్ సచివాలయం లో "సర్" ఓట్ల పురోగతి ని పరిశీలించిన అద్దెయ్య



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూలై 12;**

మాచర్ల పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ లైన్ లో గల సచివాలయం లో జరుగుతున్న "సర్" ఓట్ల పురోగతి ని పల్నాడు జిల్లా ఈఆర్ఓ అద్దెయ్య ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబు, సంభోజు వేణు, 72,73,74,75 టీడీపీ బిఎల్వోలు, వైసీపీ బిఎల్ఏలు పాల్గొన్నారు.

# శ్రీ సూర్య కాలేజీ లో నూతనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిగ్రీ కోర్స్

**నరసాపురం జూలై 12 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**




నరసాపురం శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి నవశకానికి నాంది పలుకుతూ నూతనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిగ్రీ కోర్సు్ను ప్రవేశపెడుతున్నట్లు సంస్థ సెక్రటరీ ఌ కరస్పాండెంట్ శ్రీ ఘంటసాల బ్రహ్మాజీ తెలిపారు. బిఎస్ సి హానర్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ) కోర్స్ పూర్తి చేసిన వారికి ఐటి, హెల్త్ కేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హెల్త్ కేర్, మ్యానుఫ్యాక్చర్, ఆటోమొబైల్, సైబర్ సెక్యూరిటీ, ఈ -కామర్స్ వంటి మరెన్నో రంగాలలో మంచి అవకాశాలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్ ,మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్ డేటా అనలిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఇంజనీర్, బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కన్సల్టెంట్ స్థిరపడటానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని నరసాపురం ప్రాంత యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సెక్రటరీ కోరారు.

# మంత్రి మండిపల్లి సమక్షంలో టీడీపీలో చేరిన పది కుటుంబాలు

**రామాపురం జనసముద్రం న్యూస్ జూలై 12**

రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని గాలంగుండ్లపల్లి గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఌ క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివృద్ధి, ప్రజాసేవా నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ మంత్రి సమక్షంలో పచ్చ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభిమానం, విశ్వాసమే తెలుగుదేశం పార్టీకి నిజమైన బలమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని



పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని, ప్రజాసేవలో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సురేంద్ర రెడ్డి మండల నాయకుడు వెంకటరామిరెడ్డి , గ్రామ టీడీపీ నాయకుడు చరసాల దిలీప్ యాదవ్ , స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీలో చేరిన కుటుంబాలకు ఘన స్వాగతం పలికారు.

# అనంతగిరిలో ట్రెక్కింగ్‌కు వెళ్లి హైదరాబాద్ మహిళ మృతి

వికారాబాద్: ట్రెక్కింగ్‌కు వెళ్లి మహిళ మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరిలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ప్రియాంక మోల్ (47).. ట్రెక్కింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు.స్థానికులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వారాంతపు సెలవు కావడంతో హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌కు చెందిన ప్రియాంక మోల్, మరో ముగ్గురు కుటుంబసభ్యులు విహారయాత్ర కోసం ఆదివారం ఉదయం అనంతగిరి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత నందిఘాట్ పరిసరాల్లో తిరిగారు. అనంతరం ట్రెక్కింగ్ చేస్తూ వ్యూపాయింట్ దగ్గరకి వెళ్లి అనంతగిరి అటవీ ప్రాంతాన్ని తిలకించారు. ఈ క్రమంలో ప్రియాంక మోల్ తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు.ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను నాలుగు కి.మీ దూరంలో ఉన్న వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. ప్రియాంక గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు.

# చిన్న వెంకన్న నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళం.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 12 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు ద్వారా రెండు లక్షలు రూపాయలు సమకూరింది.ఆదివారం నూజివీడు వాస్తవ్యులు సి వెంకట రమణ కుటుంబ సభ్యులు రూ.1,00,000/- విరాళాన్ని మరొక భక్తుడు గుడివాడ వాస్తవ్యులు ఎన్ .పాండురంగారావు దంపతులు 1,00,116 /- విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరెంటెంట్ జి సుబ్రహ్మణ్యం దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.





# లార్డ్స్ టెస్టు.. యస్తికా భాటియా సెంచరీ

లండన్: ఇంగ్లాండ్, భారత్ మహిళల జట్ల మధ్య ఏకైక టెస్టు జరుగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్ యస్తికా భాటియా సెంచరీతో అదరగొట్టింది. 145 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకుంది. టెస్టుల్లో ఆమెకిది తొలి శతకం. లార్డ్స్‌లో సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా యాస్తికా ఘనత సాధించింది. 69 ఓవర్లకు భారత్ స్కోర్ 264/5. ప్రస్తుతం టీమ్‌ఇండియా 379 పరుగుల ఆధిక్యంలో ఉంది. యస్తికా (105), రిచా ఘోష్ (0) క్రీజులో ఉన్నారు. స్మృతి మంధాన 70, షెఫాలీ వర్మ 33, దీప్తి శర్మ 10 పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3, లారెన్ బెల్ రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 170, భారత్ 285 పరుగులకు ఆలౌటయ్యాయి.

# టీజీ20 లీగ్ విజేతగా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్



హైదరాబాద్: టీజీ20 లీగ్ తొలి సీజన్ విజేతగా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (ఎఎవతీఖుఝుఎ వ జష్ఖుఎజూఅశీఅం) నిలిచింది. ఖమ్మం ఏసెస్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 158 పరుగుల లక్ష్యాన్ని ఈ ఛాంపియన్స్ 17.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్‌రెడ్డి (48; 30 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి రాణించాడు. వైష్ణవ్ రెడ్డి (41ి; 28 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. షణ్ముఖ అశ్విన్ (36; 21 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రణవ్ వర్మ (19ి; 16 బంతుల్లో 2 ఫోర్లు) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో హర్షిత్ సాయి, విద్యానందరెడ్డి, వేద్‌రెడ్డి, షేక్ అజర్ తలో వికెట్ తీశారు.లక్ష్యఛేదనలో సాయివికాస్ (4) ఆరంభంలోనే వెనుదిరిగినా.. అభిరథ్, షణ్ముఖ అశ్విన్ నిలకడగా ఆడారు. ఈ జోడీ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించింది. తర్వాత వైష్ణవ్, అభిరథ్ జట్టును విజయం దిశగా నడిపించారు. అభిరథ్‌ను షేక్ అజార్ వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన యశ్వీర్ (5)ని వేద్ రెడ్డి ఔట్ చేశాడు. ప్రణవ్‌తో కలిసి వైష్ణవ్ మ్యాచ్‌ను ముగించాడు.తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 157/8 పరుగులు చేసింది. మికిల్ జైస్వాల్ (65; 39 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిశాడు. హిమతేజ (31), ప్రతీక్ రెడ్డి (15), విద్యానంద రెడ్డి (20ి) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో యశ్వీర్ గౌడ్ 3 వికెట్లు, దేవ్ మెహతా, అజయ్ గౌడ్ చెరో 2 వికెట్లు, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీశారు.

## 'ఈ ఛాంపియన్స్' సంబరాలు

టీజీ20 తొలి సీజన్ విజేతగా నిలవడంతో హైదరాబాద్ ఆటగాళ్లు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. మైదానంలో కలియ తిరుగుతూ.. తమకు మద్దతుగా నిలిచిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. టీజీ20 లీగ్ ఫైనల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా హైదరాబాద్ స్పిన్నర్ యశ్వీర్ గౌడ్ నిలిచాడు. ఈ మ్యాచ్‌లో యశ్వీర్ నాలుగు ఓవర్లు వేసి 17 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.



# ధనుష్.. 'తమిళ మురుగన్'



తమిళ కథానాయకుడు ధనుష్ కొత్త చిత్రాన్ని ప్రకటించారు. వెట్రి మారన్ దర్శకత్వంలో 'తమిళ మురుగన్' అనే సినిమాని పట్టాలెక్కించనున్నారు. ఈ విషయాన్ని శనివారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఫస్ట్‌లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అందులో ధనుష్ చేతిలో వేల్ ఆయుధాన్ని పట్టుకుని ఏనుగుపై యుద్ధ భూమిలోకి వస్తున్నట్లుగా ఆసక్తికరంగా కనిపించారు. "శాశ్వత రక్షకుడు, యోధుడు, తమిళ ప్రజలకు.. వారి నేలకు రాజు, నాయకుడు, కొత్రవై పుత్రుడు.. తమిళ మురుగన్" కథ ఇది అన్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నారు ధనుష్. అయితే ఇది పూర్తిగా పురాణ గాథగా సాగుతుందా.. లేక ఫాంటసీ అంశాలతో నిండిన యాక్షన్ డ్రామాగా ఉంటుందా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతమందించనుండగా.. వండర్‌బార్ ఫిల్మ్స్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు నిర్మించనున్నాయి.

# 'లెనిన్'తో అఖిల్‌కు సరైన విజయం దక్కింది: నాగార్జున



"అనుకున్నది సాధించాలనే తపన అఖిల్‌లో చిన్నప్పటి నుంచీ ఉంది. ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. ప్రతి సినిమాకీ ఎంతో కష్టపడుతూ, వందశాతం న్యాయం చేస్తాడు. కానీ విజయానికి అడుగు దూరంలో నిలిచిపోయేవాడు. 'లెనిన్'తో తనకు సరైన విజయం దక్కింది" అన్నారు అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున. ఆయన, సూర్యదేవర నాగవంశీ కలిసి నిర్మించిన 'లెనిన్' విజయోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా, మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో అక్కినేని నాగార్జున తన తనయుడు కథానాయకుడిగా విజయం అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఉత్సాహంగా మాట్లాడారు. "ఏడాది కిందట 'తండేల్' విజయోత్సవానికి హాజరయ్యా. ఇప్పుడు 'లెనిన్' వేడుకకి వచ్చా. చైతన్య, అఖిల్ నాకు రెండు కళ్లతో సమానం. ఆ ఇద్దరి విజయం కోసం అభిమానులు ఎదురు చూస్తుంటారు. 'తండేల్' వచ్చినప్పుడు కాలర్ ఎగరేశారు, ఇప్పుడు 'లెనిన్' విజయంపైనా అంతే సంతోషంగా ఉన్నారు. ఈ సినిమాకి వాయిస్ ఇచ్చిన తారక్ (ఎన్టీఆర్) మా పెద్దబ్బాయి. తనకు కృతజ్ఞతలు" అన్నారు నాగార్జున. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ "నా గత చిత్రాల్ని మరిచిపోయి 'లెనిన్'ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర నాగవంశీ, భాగ్యశ్రీ బోర్సేతో పాటు చిత్రబృందం పాల్గొంది.

# చిరంజీవి ఇంటి పచ్చడి నాకు చాలా ఇష్టం: మురళీ శర్మ





చిరంజీవి తో కలిసి నటించడం ఎప్పుడూ మంచి అనుభవమే అని నటుడు మురళీ శర్మ అన్నారు. వీరిద్దరూ బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వీవస్త్రు158'లో కలిసి నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మురళీ శర్మ చిరంజీవి గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు." చిరు గారి ఇంటి పచ్చడి నాకు చాలా ఇష్టం. నిన్న సెట్‌లో ఆయన ఒక పెద్ద పచ్చడి డబ్బా తెచ్చారు. 'మురళీకి కావాల్సినంత ప్యాక్ చేసి ఇవ్వండి' అని మేనేజర్‌తో చెప్పారు. మేము ఇప్పుడు 'Mega158' షూట్ చేస్తున్నాం. షూటింగ్ బ్రేకుల్లో ఎక్కువగా పాత జ్ఞాపకాల గురించి మాట్లాడుకుంటాం. కొన్నిసార్లు నేను పాటలు పాడితే చిరు కుర్చీలో కూర్చొనే స్టెప్స్ వేస్తారు. 'గాడ్‌ఫాదర్' షూటింగ్‌లో మొదటి రోజు నేను కొంచెం ఇబ్బంది పడ్డాను. ఆ విషయం డైరెక్టర్‌తో చెప్పాను. తర్వాత 'మొదటిరోజు తీసిన సన్నివేశాలు రీషూట్ చేయొచ్చా?'అని చిరు గారిని అడిగాను. ఆయన అంగీకరించారు. చిరుని నేను అన్నయ్య అని పిలుస్తా. ఆయన చాలా వినయంగా ఉంటారు." అని మురళీ శర్మ తెలిపారు.ఇక, చిరంజీవితో మురళీ శర్మ నటించే మూడో సినిమా ఇది. వీరిద్దరు ఇంతకుముందు 'గాడ్‌ఫాదర్', 'భోళా శంకర్' సినిమాల్లో కలిసి నటించారు. Mega158 (వర్కింగ్ టైటిల్)గా రానున్న ఈ మూవీ ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటి.




సమంత ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా రూ.100 కోట్ల వసూళ్లు రాబట్టిన నేపథ్యంలో చిత్రబృందం ఓ వీడియో విడుదల చేసింది. వసూళ్ల విషయంద తెలిశాక సమంత రియాక్షన్‌ను ఆ వీడియోలో చూడొచ్చు. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూన్ 19న విడుదలైన విషయం తెలిసిందే.

# అసోసియేషన్‌లో వివాదం.. జానీమాస్టర్ భార్యపై డ్యాన్సర్ల ఆగ్రహం

హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో వివాదం రేగింది. అసోసియేషన్ అధ్యక్షురాలు, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలతపై డ్యాన్సర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుమలత తీరును నిరసిస్తూ అసోసియేషన్‌కు చెందిన 10 మంది డ్యాన్సర్లు రాజీనామా చేశారు. ఫెడరేషన్ అనుమతి లేకుండా బై ఎలక్షన్ నిర్వహించేందుకు సుమలత సిద్ధం కావడంతో ఈ వివాదం రేగినట్లు సమాచారం.

